క్లుప్తంగా

దీపావళితో ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు




రామ్‌కుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య

వెంకటగిరి(సైదాపురం)/నాయుడుపేట టౌన్ : దీపావళితో ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నిండాలని వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆకాంక్షించారు. వారు ఆదివారం వెంకటగిరి, సూళ్లూరుపేట నియోజకవర్గ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు దీపావళిని ఆనందంగా జరుపుకోవాలని కోరారు.

పరామర్శ



షబ్బీర్‌తో మాట్లాడుతున్న కిలివేటి సంజీవయ్య

నాయుడుపేట టౌన్ : వైఎస్సార్ సీపీ ముస్లిం మైనారిటీ విభాగం నియోజకవర్గ కన్వీనర్ షేక్ షబ్బీర్‌ను ఆదివారం సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పరామర్శించారు. షబ్బీర్ కంటికి శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. సంజీవయ్య ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్య సమాచారం తెలుసుకున్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు కలికి మాధవరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, దొరవారిసత్రం మండల కన్వీనర్ రాహుల్‌రెడ్డి, నాయకులు చదలవాడ కుమార్, దారా రవి, నిడిగింటి చిట్టి బాబు, పేర్నాటి రాహుల్ తదితరులు ఉన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు

రాపూరు: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ గెస్ట్ లెక్చరర్ ఉద్యోగానికి ఈ నెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ హనుమంతయ్య తెలిపారు. వివరాలకు 9441523273లో సంప్రదించాలని సూచించారు.

నేడు కోటలో రచ్చబండ

కోట : మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సోమవారం కర్లపూడి, వెంకన్నపాళెం గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇందులో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నట్టు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించడం తగదు

వెంకటగిరి రూరల్ : పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ జనసేన బహిష్కృత నేత గూడూరు వెంకటేశ్వర్లును ఇబ్బందులకు గురిచేయాలని చూడడం తగదని ఏపీ కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ఆదిశేషయ్య విమర్శించారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ వెంకటేశ్వర్లును ఇబ్బందులకు గురిచేయాలని స్థానిక రాజకీయ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. తమ వారిని ఇబ్బందులకు గురిచేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. నెల్లూరు జిల్లా అధక్షుడు మోచర్ల మధు, ఉపాధ్యక్షులు కోళ్లపూడి వేణుగోపాల్, పాదలకూరు వెంకటసుబ్బయ్య, పి కృష్ణయ్య, రఘురామయ్య పాల్గొన్నారు.

గుడ్లూరు బాధితులకు సంఘీభావం



జక్కంపూడి రాజాతో గూడూరు నాయకులు

గూడూరు రూరల్ : నెల్లూరు జిల్లా కందుకూరు నియోజకవర్గం గుడ్లూరులో ఇటీవల వైఎస్సార్ సీపీ కార్యకర్తను హత్య చేశారు. ఈ క్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజాతో కలిసి గూడూరు నియోజకవర్గం యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు సునీల్‌రెడ్డి, ఎంపీపీ బూదూరు గురవయ్య గుడ్లూరు వెళ్లి బాధితులను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. నాయకులు పన్నిబోయిన మహేంద్ర యాదవ్, కొట్టు అశోక్, వాకాటి అశోక్, వాకాటి కిరణ్‌కుమార్, యనమల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

15 బైక్‌ల స్వాధీనం

తడ: మండలంలోని తడకండ్రిగ పంచాయతీ గుమ్మిడిపూండి కాలనీలో ఆదివారం ఉదయం నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 15 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, సర్కిల్ పరిధిలోని ఎస్‌ఐలు పాల్గొన్నారు.

చికెన్ ధరలు		20-10-2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	130
లేయర్ లైవ్	:	118
బ్రాయిలర్ చికెన్	:	236
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	260
లేయర్ చికెన్	:	200

దొరవారిసత్రం : తనియాలిలో రోడ్డుపై ఏర్పడిన గుంతలు



చిట్టమూరు : గుంతలు పడిన సూళ్లూరుపేట-కోట రోడ్డు



పెళ్లకూరు : కిష్టప్పకండ్రిగ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



పెళ్లకూరు : బురదమయంగా యాలకారికండ్రిగ రోడ్డు



అడుగు వేయాలంటే నరకమే..!

గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. పెద్ద పెద్ద గుంతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రోడ్ల గురించి పట్టించుకోవడం లేదు. మేమొస్తే రోడ్లను బాగు చేస్తాం. ప్రయాణాన్ని సౌకర్యవంతంగా సాగేలా చేస్తాం. అని కూటమి నేతలు ఎన్నికల్లో ప్రచారం చేశారు. రోడ్ల నిర్మాణాలకు అనుమతులు, నిధులు మంజూరైనా కాంట్రాక్టర్లు, వైఎస్సార్ సీపీ నాయకులపై అవినీతి ఆరోపణలు చేసి పనులు చేయకుండా రాద్ధాంతం చేశారు. ఎన్నికల్లో అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా రోడ్ల గురించి పట్టించుకోలేదు. వర్షాలకు మోకాలి లోతు గుంతలు పడడంతో అడుగు వేయాలంటే నరకం కనిపిస్తోంది. నిధులు మంజూరైనా పనులు ఎందుకు చేయడం లేదని ప్రజలు అడుగుతున్నా సమాధానం చెప్పే నాథుడు లేడు. నకిలీ మద్యం తయారీ, విక్రయాలు, ఇసుక, గ్రావెల్, మట్టి తవ్వకాలను యథేచ్ఛగా సాగిస్తూ అక్రమార్జనపై చూపుతున్న శ్రద్ధ ప్రజల సౌకర్యంపై పెట్టడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలు నిలదీసినా.. ఆగ్రహం వ్యక్తం చేసినా నవ్విపోదురు గాక నాకేటి.. అన్న చందాన కూటమి నేతలు, కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది.

– దొరవారిసత్రం/చిట్టమూరు/పెళ్లకూరు/నాయుడుపేట టౌన్/చిల్లకూరు/ఓజిలి/వెంకటగిరి రూరల్/వెంకటగిరి (సైదాపురం)/కలువాయి(సైదాపురం) /వాకాడు :



పెళ్లకూరు : రొచ్చురొచ్చుగా మారిన కప్పగుంటకండ్రిగ రోడ్డు



చిట్టమూరు : కోట-నాయుడుపేట రహదారి



చిట్టమూరు : గుంతలమయంగా కుమ్మరిపాలెం రోడ్డు



పెళ్లకూరు : దుర్భరంగా మారిన యడపూడి రోడ్డు



నాయుడుపేట టౌన్ : కోనేటి రాజుపాళెం-మూమ్మయపాయలెం రోడ్డు



గూడూరు మండలం విదూరుకు వెళ్లే రోడ్డుపై ఏర్పడిన గుంతలు



చిల్లకూరు: వరగలిలో రోడ్డు ఏర్పడిన గుంతలు



చిల్లకూరు : వరగలిలో రోడ్డు ఇది



ఓజిలి: బత్తలాపురం వద్ద గుంతలు



సైదాపురం: సైదాపురం-పాదలకూరు రోడ్డు



వెంకటగిరి రూరల్ : తెలుగుగంగ కాలువ వంతెన వద్ద పడిన గుంతలు



కలువాయి: గోపవరం వద్ద చప్టాపై నిలిచిన వర్షపు నీరు

దళితులను ఇబ్బందులకు గురిచేస్తే ఊరుకోం

వాకాడు : కూటమి నేతల ఒత్తిళ్లతో అధికారులు దళిత రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చూస్తూ ఊరుకునేది లేదని వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. వాకాడు, గొల్లపాళెం గ్రామాల్లో ఆలయ భూములు కౌలుకు చేస్తున్న రైతులు ఆదివారం రామ్‌కుమార్‌రెడ్డిని కలిశారు. వారు మాట్లాడుతూ స్థానిక అలఘునాథస్వామి, కోదండరామస్వామి, నాగేశ్వర స్వామి ఆలయాల భూములను ఎన్నో ఏళ్లుగా కౌలుకు సాగు చేస్తున్నామని తెలిపారు. ఇప్పుడు కూటమి నేతల ఒత్తిళ్లతో ఆలయ అధికారులు తమను వెళ్లగొట్టి కౌలు వేలం వేస్తున్నారని తెలిపారు. స్పందించిన రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గత నెల 24 ఎకరాలకు వేలం పాటలు ప్రారంభించి మధ్యలోనే నిలిపేశారని తెలిపారు. ఈ నెల 21న 64 ఎకరాలకు వేలం పాటలు నిర్వహించాలని ప్రకటనలు చేయడంపై అనుమానం వ్యక్తం చేశారు. మూడు ఆలయాల భూములను సర్వే చేసి గుర్తించాలన్నారు. వివరాలను ఆలయాల వద్ద నోటీసు బోర్డులో ఏర్పాటుచేయాలని సూచించారు. తర్వాత పారదర్శకంగా వేలం పాటలు నిర్వహించాలని తెలిపారు. తొలి ప్రాధాన్యత అనేక ఏళ్లుగా కౌలు చేస్తున్న రైతులకు ఇవ్వాలని కోరారు. పేద దళితులకు అన్యాయం జరుగుతుంటే దళిత ఎమ్మెల్యే చూస్తూ ఊరుకోవడం దారుణమన్నారు. పేద దళిత రైతులకు అన్యాయం జరిగితే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం శ్రీ చెన్నకేశవస్వామి ఆలయ నూతన కమిటీ సభ్యులు రామ్‌కుమార్‌రెడ్డిని కలిసి ఆలయ అభివృద్ధిపై చర్చించారు.



రైతులతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

ఎంపీ గురుమూర్తిని కలిసిన ఎన్ఎస్ఆర్ కాలనీ వాసులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలో ఎన్ఎస్ఆర్ కాలనీ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరారు. వారు సోమవారం తిరుపతిలో ఎంపీ మద్దెల గురుమూర్తికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కాలనీ వద్ద రైల్వే గేటు మూసివేయడంతో సుమారు 300 కుటుంబాలకు రాకపోకలకు ఇబ్బంది కలిగిందని తెలిపారు. అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతూ ఇప్పటికే పలుమార్లు రైల్వే అధికారులతో పాటు సదరన్ రైల్వే డీఆర్ఎంకు వినతి పత్రాలు అందజేశామని పేర్కొన్నారు. స్పందించిన ఎంపీ సమస్యలను రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లి అండర్ పాస్ బ్రిడ్జి ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో తడుకు చందు, గోవిందు, శ్రీనివాస్, జడ వెంకటేష్, తదితరులు ఉన్నారు.



తిరుపతి ఎంపీతో ఎన్ఎస్ఆర్ కాలనీ వాసులు

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

సైదాపురం: వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగ జిల్లా కమిటీలను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. పబ్లిసిటీ వింగ్ జనరల్ సెక్రటరీగా వరదబండి ప్రభాకర్‌రెడ్డి, ఐటీ వింగ్ జనరల్ సెక్రటరీగా చెమిర్తి శ్రీనివాసులురాజు, వైఎస్సార్ టీయూసీ జనరల్ సెక్రటరీగా చీర్ల వెంకురెడ్డి నియమితులయ్యారు. అలాగే వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్ వింగ్ అధ్యక్షుడిగా కలువాయి జెడ్పీటీసీ అనీల్ కుమార్ రెడ్డి, నెల్లూరు జిల్లా అంగన్‌వాడీ కమిటీ ప్రధాన కార్యదర్శిగా గోపిదేశి రమణయ్య, ఐటీ వింగ్ కార్యదర్శిగా పవన్, జిల్లా వికలాంగుల కమిటీ కార్యదర్శిగా రామ య్య, జిల్లా ఎంప్లాయిస్ పెన్షనర్స్ వింగ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నరసింహారెడ్డి, మైనార్టీ వింగ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా జిలాని నియమితులయ్యారు. తమకు పదవులు రావడానికి కృషి చేసిన వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.



ఎమ్మెల్సీ మేరిగతో జంగిట సురేష్ యాదవ్





ప్రభాకర్‌రెడ్డి, వెంకురెడ్డి, శ్రీనివాసులురాజు

మండల రైతు అధ్యక్షుడిగా సురేష్ యాదవ్

చిట్టమూరు : వైఎస్సార్ సీపీ రైతు విభాగం మండల అధ్యక్షుడిగా చిట్టమూరుకు చెందిన జంగిట సురేష్ యాదవ్‌ను నియమించినట్లు ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. సురేష్ యాదవ్ ఆదివారం మేరిగ మురళీధర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

పెచ్చుమీరిన కూటమి నేతల అరాచకాలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న సంజీవయ్య

తడ : కూటమి నేతల అరాచకాలు పెచ్చుమీరాయని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. మండలంలోని పూడి పంచాయతీ సర్పంచ్ పరమశివంరెడ్డిని అరెస్టు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ఆదివారం పూడి గ్రామానికి చేరుకుని వివాదానికి కారణమైన పొలాన్ని పరిశీలించారు. విలేకరులతో మాట్లాడారు. సర్పంచుకు సమాచారం ఇవ్వకుండా ఇరిగేషన్ అధికారులు టీడీపీ నాయకులతో కలిసి సర్వే చేశారని తెలిపారు. దీనిపై సర్పంచ్ అభ్యంతరం తెలిపారని తెలిపారు. టీడీపీ నాయకుడు పోలీసులకు ఫిర్యాదు చేయడం, వారు విచారించకుండానే కేసు నమోదు చేసి సర్పంచును ఇబ్బందులకు గురిచేయడం దారుణమన్నారు. మరుసటి రోజు ఇరిగేషన్ అధికారులతో ఫిర్యాదు చేయించి పరమశివం రెడ్డిని అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. దాడి జరిగి ఉంటే ఇరిగేషన్ అధికారులు అదే రోజు ఫిర్యాదు చేసి ఉండేవారని తెలిపారు. టీడీపీ నాయకుల ఒత్తిడి మేరకే రెండో రోజు ఫిర్యాదు చేసినట్టు అర్థమవుతోందన్నారు. కారూరు పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ నిత్యసుందర్‌రెడ్డి ఫొటోను తొలగించారని తెలిపారు. తమ నాయకులపై కక్ష సాధింపులకు దిగితే ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కే.ఆర్ముగం, ఆర్కే సుందర్ రెడ్డి, కే.మురుగన్, ఏ మునుస్వామిరెడ్డి, ఉచ్చూరు మునుస్వామి రెడ్డి, ఎం.రమేష్‌రెడ్డి, శివకుమార్, రాజ్ కుమార్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు పెంచాలి

గూడూరు రూరల్ : మున్సిపాలిటీల్లో పనిచేసే కార్మికులకు వేతనాలు పెంచాలని సీఐటీయూ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడు బాలసుబ్రమణ్యం డిమాండ్ చేశారు. గూడూరులోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు దారా కోటేశ్వర రావు, వడ్డిపల్లి చెంగయ్య, జోగి శివకుమార్, బీవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

దీపావళికి ముస్తాబవుతున్న కోన

రాపూరు: మండలంలో ప్రముఖపుణ్యక్షేత్రమైన పెంచలకోన సోమవారం జరిగే దీపావళి పండుగకు ముస్తాబవుతోంది. దీపావళి సందర్భంగా రథోత్సవం, నరకాసుర వధ కార్యక్రమాలను నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలో రథాన్ని, నరకాసురుని బొమ్మను తయారు చేస్తున్నారు. సోమవారం ఉదయం స్వామివారి మూలమూర్తికి పాలు, తేనె, పెరుగు, నెయ్యి, చందనం, పసుపు, కుంకుమ, నారికేళం, తులసి మాల, వివిధ పళ్లరసాలతో స్నపన తిరుమజరం నిర్వహిస్తామని దేవస్థాన అధికారులు తెలిపారు. ఉదయం 9 గంటలకు శ్రీపెనుశిల లక్ష్మీనరసింహ స్వామి , ఆదిలక్ష్మిదేవి, చెంచులక్ష్మి దేవి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను శ్రీకృష్ణుడు, రుక్మిణీదేవి, సత్యభామగా అలంకరించి రథంపై కొలువుతీర్చి కోన మాడవీధుల్లో క్షేత్రోత్సవం, నరకాసునివధ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని ఏఎల్‌సీఎం మైదానంలో ఏర్పాటు చేసిన 12 బాణసంచా దుకాణాలను ఆదివారం సీఐ బాబి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దుకాణాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నిబంధనలు పాటించాలని సూచించారు.

నిబంధనలు పాటించాలి

వెంకటగిరి రూరల్ : బాణసంచా దుకాణదారులు నిబంధనలు తప్పని సరిగా పాటించాలని వెంకటగిరి సీఐ ఏవీ రమణ తెలిపారు. ఆయన ఆదివారం అగ్నిమాపశాఖ అధికారులతో కలిసి వెంకటగిరి పట్టణంలోని విశ్వోదయ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దుకాణాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దుకాణాల ముందు నో స్మోకింగ్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అగ్ని ప్రమాదాల నివారణకు సంబంధించిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



బాణసంచా దుకాణాలను పరిశీలిస్తున్న సీఐ

కూడళ్లలో ప్రజలకు అవగాహన

దీపావళి పండుగ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పట్టణంలోని కూడళ్లలో ప్రజలకు సీఐ ఏవీ రమణ, ఎస్ఐ ఏడుకొండలు అవగాహన కల్పించారు. అగ్నిమాపక శాఖ అధికారి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్ : మండలంలోని పండ్లూరు గ్రామ సమీపంలో జాతీయ రహదారి వద్ద ఆదివారం సాయంత్రం కారు ఢీకొనడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. పండ్లూరు గ్రామానికి చెందిన సుబ్రమణ్యం గేదెలను మేపుకుని సాయంత్రం ఇంటికి వస్తున్నాడు. రోడ్డు పక్కన నడుస్తున్న అతన్ని నెల్లూరు నుంచి నాయుడుపేట వైపు వెళుతున్న కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.